# గ్రామాల్లో జోరుగా ప్రచారం



గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మాందాపూర్ గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మాచారెడ్డి/భిక్కనూరు/రాజంపేట్/బీబీపేట్, నవంబర్ 3 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ బీఆర్ఎస్ నాయకులు గడప గడపకూ తిరిగి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ హంజీనాయక్, గ్రామ అధ్యక్షుడు శ్రీధర్ రావు, భాస్కర్, అబ్దుల్‌ఖాన్, జహంగీర్, హన్మాండ్లు, ప్రకాశ్, శ్రీనివాస్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి ప్రచారం చేశారు. మండల నాయకులు సామల భరత్, నర్పత్‌సింగ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట మండలం కొండాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. గ్రామ పరిధిలోని ఇనాం తండాలో వృద్ధులు, మహిళలు, రైతులను కలుస్తూ సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ మళ్లీ అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి జాజాల సురేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గణేశ్, నారాయణ గౌడ్, లక్ష్మణ్, దత్తయ్య, దిలీప్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీబీపేట్ మండలంలోని మాందాపూర్, యాడారం, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, జనగామ, మల్కాపూర్, కోనాపూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గంలో పోటీచేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



కొండాపూర్‌లో మహిళకు మ్యానిఫెస్టో గురించి వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



భిక్కనూరులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కేసీఆర్‌కు ఎంత ఎక్కువ మెజారిటీవస్తే అంత అభివృద్ధి

**ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్**




మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి, నవంబర్ 3 : కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఎంత ఎక్కువ మెజారిటీతో గెలిపిస్తే అంత ఎక్కువ స్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. శుక్రవారం శుభం హాల్‌లో నియోజకవర్గ బూత్ స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క బూత్ స్థాయి నాయకుడు మెజారిటీపై దృష్టి పెట్టాలని, ప్రతి ఒక్క బూత్ లెవల్‌లో కార్యకర్తలు సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన బ్లూ టూత్ ప్రింటర్ ఎలా ఉపయోగించాలో శిక్షణ ఇచ్చారు. ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిర్మల్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు ఎంజీ వేణుగోపాల్ గౌడ్, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, కామా రెడ్డి ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపీగౌడ్ పాల్గొన్నారు.

## ‘తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసింది ముదిరాజ్‌లే’



మాట్లాడుతున్న రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండ ప్రకాశ్

కామారెడ్డి, నవంబర్ 3 : తెలంగాణ ఉద్యమంలో 80 శాతం ముదిరాజ్ బిడ్డలే కీలకంగా పని చేశారని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండ ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ భవనంలో శుక్రవారం ముదిరాజ్ ముఖ్యనేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు ముదిరాజ్‌లపై ప్రేమ ఉంది కాబట్టే 34 మంది ఎమ్మెల్యేలు ఓట్లు వేసి రాజ్యసభకు పంపించిన గొప్ప మహానుభావుడని అన్నారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నారని, ముదిరాజ్‌లకు అన్ని విధాలుగా ఆదుకుంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ కేసీఆర్‌కు పూర్తి మద్దతు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పున్న రాజేశ్వర్, ముదిరాజ్ రాష్ట్ర మహాసభ ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్, యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి జగన్, నంద రమేశ్, గరిగెంటి లక్ష్మీనారాయణ, ప్రసాద్, కాళ్ల గణేశ్, దుబ్బాక ప్రసాద్, భిక్నూర్ సర్పంచ్ తునికి వేణు, సొసైటీ చైర్మన్ గంగుల భూమయ్య, దోమకొండ ఎంపీటీసీ కడారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో పౌరులు భాగస్వాములు కావాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**




కంట్రోల్ రూం పని తీరును పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు పరా శివమూర్తి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, నవంబర్ 3 : ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయడంలో పౌరుల భాగస్వామ్యం కూడా కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. శుక్రవారం జిల్లాకు నియమించిన వ్యయ పరిశీలకులు పరా శివమూర్తి, ఎస్పీ సింధూశర్మతో కలిసి కంట్రోల్ రూం ఏర్పాటు చేసిన సీ-విజిల్, 1950, ఎంసీఎంసీల పనితీరును పరిశీలించి, సంబంధిత నోడల్ అధికారులతో వాటిని నిర్వహిస్తున్న తీరును వ్యయ పరిశీలకులకు వివరించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు సూచించిన మేరకు పౌరులు వాయిస్ మెస్సేజ్‌లను, వాట్సాప్ ఫిర్యాదులు, ఈ మెయిల్ ఐడీ ద్వారా కూడా తెలియజేసేందుకు కంట్రోల్ రూంలో తగు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ఏదేని సమాచారం తమ దృష్టికి వస్తే వెంటనే ఫొటోలు, వీడియోలు, మెస్సేజ్‌లను సీ-విజిల్ యాప్, 7901678854 వాట్సాప్ నంబర్ tsla2023 complaints.kmr@gmail.com మెయి ల్ ఐడీల ద్వారా తెలియజేయాలన్నారు. సీ-విజిల్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని తమ చుట్టు పక్కల జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అప్‌లోడ్ చేయాలని కోరారు. 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు కూడా డయల్ చేసి తెలుపవచ్చని, పేరు చిరునామా, ఫోన్ నంబర్‌ను గోప్యంగా ఉంచుతామన్నారు. 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూంలో అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు.

## ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలి

భిక్కనూరు, నవంబర్ 3 : నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా రైతుల నుంచి ధాన్యం సేకరించి, ట్యాగింగ్ చేసిన రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల కమిషనర్ అనిల్‌కుమార్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి భిక్కనూరు మండలంలోని బస్వాపూర్, భిక్కనూరు, అంతంపల్లిలోని కొనుగోలు కేంద్రాలు, సిద్ధరామేశ్వర బాయిల్డ్ రైస్ మిల్లును శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం వచ్చిన వెంటనే అన్ లోడ్ చేసుకోవాలన్నారు. లారీలను త్వరగా పంపించాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, మల్లికార్జున్, డీసీవో సింహచలం, సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానంద, డీటీ కిష్టయ్య, ఏడీఏ అపర్ణ, ఏవో రాధ, ఏఈవో వినోద్ గౌడ్, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో, టీజీవో ఉమ్మడి జిల్లా సమావేశం

■ నూతన కార్యవర్గం ఎన్నిక

ఖలీల్‌వాడి, నవంబర్ 3 : ఉమ్మడి జిల్లాల టీఎన్జీవో, టీజీవో విస్తృతస్థాయి సమావేశాన్ని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. టీఎన్జీవో, టీజీవోల సమస్యలు తదితర వాటిపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతోపాటు ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషిచేయాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ టీజీవో జిల్లా అధ్యక్షుడిగా సంగం అమృత్‌కుమార్ (ఆడిట్ శాఖ), కార్యదర్శిగా హన్మంత్‌రెడ్డి (పశు వైద్యశాఖ), కోశాధికారిగా దేవీసింగ్ (వ్యవసాయ శాఖ), అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ జలగం తిరుపతిరావు, కామారెడ్డి జిల్లా టీజీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా దేవేందర్, సాయారెడ్డి, బాన్సువాడ తాలూకా అధ్యక్షుడిగా జగన్‌ను ఎన్నుకున్నారు. టీజీవో సీనియర్ నాయకుడు రాములు, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, సలహాదారుడు ఆకుల ప్రసాద్, కేంద్ర బాధ్యులు పూల శ్రీనివాస్, కె.సతీశ్‌కుమార్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

కామారెడ్డి రూరల్ , నవంబర్ 3 : కామారెడ్డి మండలం టేక్రియాల్ గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై నిజామాబాద్ నుంచి కామారెడ్డి వెళ్లే వాహనాలను శుక్రవారం పోలీసులు తనిఖీ చేశారు. కామారెడ్డి డీఎస్పీ నేతృత్వంలో రూరల్ సీఐ శ్రీనివాస్, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కారులో 114 చీరలను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ. 6 లక్షల 16వేల 500 వరకు ఉంటుందని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.